పోలింగ్‌కు సర్వం సిద్ధం

- కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి
- 153 భవనాల్లో 418 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
- ఓటు వినియోగించుకోనున్న 4,63,864 మంది ఓటర్లు
- ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరుతున్న అధికారులు



జేఎన్‌టీయూలో సిద్ధంగా ఉన్న ఈవీఎం మెషిన్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో గురువారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లకు కావల్సిన ఏర్పాట్లు చేపట్టారు. ఓటర్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో 4,63,864 మొత్తం ఓటర్లు ఉండగా అందులో 2,42,832 పురుషులు, 2,20,909 మహిళా ఓటర్లు, 123 ఇతరుల ఓట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని అధికారులు కోరారు.

పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు..

నియోజకవర్గంలో 418 పోలింగ్ స్టేషన్‌లు, 153 భవనాల్లో పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ఓటర్ల కోసం పోలింగ్ గదిలో విద్యుత్ లైట్లతో పాటు, ఫ్యాన్లు, మంచినీటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కూడా కల్పించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ భవనాల్లో మరుగుదొడ్లు, మూత్ర శాలలు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి స్టేషన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటు వేసే వారికి ఎలాంటి సలహాలు, సూచనలు తెలియజేసే విధంగా సిబ్బందిని కూడా నియమించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

రాజకీయ పార్టీల వారిని పోలింగ్‌స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉండే విధంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద పోలీస్ బందోబస్తు కోసం వివిధ రకాల బలగాలను ఏర్పాటు చేశారు.

అదనపు బలగాల మోహరింపు

నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాలానగర్, సనత్‌నగర్, బోయిన్‌పల్లి, బేగంపేట పోలీస్‌స్టేషన్లలో అదనపు బలగాలను ఇప్పటికే సిద్ధం చేశారు. నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలను కూడా అదనంగా మోహరించారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మెషిన్లు..

నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం మెషిన్లను జేఎన్‌టీయూహెచ్‌లో భద్రపరిచారు. బుధవారం సాయంత్రం ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ సిబ్బందితో పాటు బందోబస్తు సిబ్బంది కూడా ఆయా పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో బయలుదేరారు.

పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా

- సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్ట భద్రత
- చందానగర్ సీఐ పాలవెల్లి

హఫీజ్‌పేట్ : పోలింగ్ నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక నిఘాతో పాటు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని చందానగర్ సీఐ పాలవెల్లి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామన్నారు. చందానగర్‌లోని శాంతినగర్, వేముకుంట, లింగంపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్, పాపిరెడ్డి కాలనీ, గోపినగర్, గోపన్‌పల్లి ప్రాంతాలు సమస్యాత్మకంగా ఉన్నాయని సీఐఎస్ఎఫ్ ప్రత్యేక పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు.



శాంతినగర్ పోలింగ్ స్టేషన్ వద్ద భద్రతను పరిశీలిస్తున్న ఎస్ఐలు సరితారెడ్డి, విఠల్‌రెడ్డి

పోలింగ్ కేంద్రంలో టేబుల్స్ సర్దుతున్న బీఎల్‌ఓలు, ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది





ఈ పోలింగ్ కేంద్రంలో వసతులు కరువు



జేఎన్‌టీయూ నుంచి వివిధ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో తరలి వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

25 మంది సిబ్బందికి ఒక్కటే బాత్‌రూమ్

మూసాపేట: మూసాపేటలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు లేక పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పాలయ్యారు. బుధవారం సాయంత్రమే కేంద్రానికి చేరుకున్న వారికి బాత్‌రూం, విద్యుత్, టేబుల్స్ ఇలా అసౌకర్యాలు ఎదురుపడ్డాయి. అందుబాటులో బీఎల్‌ఓలు ఉండటంతో వారిని రాత్రి 8 గంటల వరకు ఆపి సౌకర్యాలు వారే ఏర్పాటు చేసుకున్నారు. తరగతి గదిలో టేబుల్స్ ఉండటంతో రాత్రి వాటిని బయటకు తీసివేసి పోలింగ్‌కు ఏర్పాట్లు చేసుకున్నారు.

- సుమారు 25 మంది సిబ్బంది రావటంతో వారికి ఒకటే బాత్‌రూమ్ ఏర్పాటు చేశారు. మిగతా బాత్ రూమ్‌లకు పాఠశాల సిబ్బంది తాళం వేసుకొని వెళ్లిపోయారు. 25 మందికి ఒక్కటే బాత్‌రూం ఇబ్బంది ఉంటుందని, అందులో మహిళలతో పాటు అయ్యప్ప మాలధారణ వాళ్లు ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్, తాగేనీరును బీఎల్‌ఓలు ఏర్పాటు చేశారు.

144 సెక్షన్ అమలు..

విధుల్లో 2500 మంది పోలీసులు

- నలుగురి కంటే ఎక్కువమంది గుమిగూడితే చర్యలు
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకే అనుమతి
- సెల్‌ఫోన్లను అనుమతించం: మాదాపూర్ డీసీపీ సందీప్



గచ్చిబౌలి: పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాలలో నలుగురి కంటే ఎక్కువమంది గుమికూడితే చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ గోనె సందీప్ స్పష్టం చేశారు. మద్యం అమ్మకాలు నిషేధమన్నారు. 28 సమస్యాత్మక ప్రాంతాలలో సీఏపీఎఫ్ సిబ్బందిని నియమించామని, అదనపు బలగాలు మూడు కంపెనీలతో పాటు 600 మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ఘటన చోటు చేసుకున్నా ఒక్క నిమిషంలో అక్కడున్న పోలీసులు స్పందిస్తారని, 8 నిమిషాలకు రూట్ మొబైల్, 12 నిమిషాలలో క్యూర్టీ టీం, 18 నిమిషాలలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ చేరుకుంటుందన్నారు. పోలింగ్ బూత్‌లోకి పార్టీ గుర్తులు, స్లిప్స్, పెన్ను, ఇంక్, వాటర్ బాటిల్స్, సిగరెట్స్, లైటర్స్‌ను అనుమతించమన్నారు. ఎక్కడైనా ప్రలోభాలకు పాల్పడితే సీవీజిల్, డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి ఫస్ట్ ఎయిడ్



గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సపర్యలు చేశారు ట్రాఫిక్ పోలీసులు. బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వారి దగ్గరికి వెళ్ళి సపర్యలు చేసి ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి పంపించారు. ఇతర వాహనదారులు ఆయన చొరవను అభినందించారు.

ప్రతి బూత్ ముందు అభ్యర్థుల వివరాలు

ఫిలింనగర్: పోలింగ్ శాతం పెంచేందుకు ఈసారి ఎన్నికల అధికారులు వినూత్న కార్యక్రమాలతో ముందుకు వచ్చారు. ఓటరు పోలింగ్ కేంద్రానికి తేలికగా చేరుకునేలా ఏర్పాటు చేశారు. గత నాలుగు వారాల నుంచి ఓటర్లను లక్ష్యంగా చేసుకొని వారికి సకల సౌకర్యాలు కల్పించే దిశలో దృష్టిపెట్టారు. పోలింగ్ స్టేషన్ ముందు అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు వివరాలతో కూడిన పోస్టర్లను అంటించారు. అంతేకాకుండా ఇప్పటికే పోల్ చీటీలను పంపిణీ చేసి అక్కడికి తేలికగా చేరుకునే గూగుల్‌మ్యాప్‌ను కూడా ఏర్పాటు చేశారు.

విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గచ్చిబౌలి: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్‌లోని లిటిల్ మిలీనియం ప్రీ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు ధరించి ప్రధానరోడ్డు, కూడళ్ళ వద్ద ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నాలెడ్జి సిటీలో సీ1జీఐసీ సెంటర్

ప్రారంభించిన సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలో సీ1 (కన్వర్జ్‌వన్) గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీస్ సెంటర్ (జీఐసీ) తన కార్యకలాపాలను భారత దేశంలో ప్రారంభించింది. ఈ సంస్థ కార్యాలయాన్ని బుధవారం జీఐసీ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ ప్రారంభించారు. సీ1 అధునాతన సాంకేతికత, పరిష్కారాల సంస్థ. దీన్ని ప్రారంభించిన అనంతరం విలేకరులతో ఆ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ మాట్లాడుతూ 10వేలకు పైగా గ్లోబల్ వినియోగదారులకు వినూత్న పరిష్కారాలను, అసమానమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీ1 ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ , కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ కొలీన్ హేబర్‌మాన్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అమృత్‌చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిరోజు స్వాములకు అన్నసమారాధన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో ప్రతిరోజు ఉదయం 4గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం స్వాములకు అన్నసమారాధన, సాయంత్రం స్వామివారి భజన కార్యక్రమాలు, పడిపూజ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలిపారు. మూసాపేట, ఆస్‌బెస్టాస్ కాలనీ, కేపీహెచ్‌బీ కాలనీ శివాలయం, హెచ్ఎంటీ హిల్స్ శివాలయంలో స్వాములకు ప్రతి రోజు అన్న సమారాధన మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. స్వాములు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.